# సాక్షి
# పెద్దపల్లి

గురువారం : 15 : ఫిబ్రవరి : 2024






## మల్లన్న సన్నిధిలో పూజలు

ఓదెల: వసంత పంచమి సందర్భంగా బుధవారం ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో రద్దీ నెలకొంది. భక్తులు తరలివచ్చి సప్రత్యేక పూజలు చేశారు.



## నిబంధనలు పాటించాలి

రామగిరి: ఈ-పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని డీఏవో ఆదిరెడ్డి అన్నారు. కల్వచర్లలో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/21.2

## వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మేనేజ్మెంట్ ట్రైనీ ఉద్యోగాలకు నోటిఫికేషన్



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలోని వివిధ విభాగాల్లో మేనేజ్మెంట్ ట్రైనీ ఉద్యోగాల నియామకానికి బుధవారం ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్ఎఫ్ఎల్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. మేనేజ్మెంట్ ట్రైనీ కెమికల్ 10, మేనేజ్మెంట్ ట్రైనీ మెకానికల్ 6, ఎలక్ట్రికల్ మేనేజ్మెంట్ ట్రైనీ 6, మేనేజ్మెంట్ ట్రైనీ ఇన్స్ట్రుమెంటేషన్ 2, మేనేజ్మెంట్ ట్రైనీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 3, మేనేజ్మెంట్ ట్రైనీ లా 1, మేనేజ్మెంట్ ట్రైనీ హెచ్‌ఆర్ 2 ఉద్యోగాలకు ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం యూనిట్‌లో 23 ఉద్యోగాలు ఉండగా కార్పొరేట్ ఆఫీస్, నోయిడా బ్రాంచ్‌లో 5 మేనేజ్మెంట్ ట్రైనీ ఉద్యోగాలు ఉన్నాయి. దరఖాస్తులకు చివరి తేది 14 మార్చి 2024. పూర్తి వివరాలకు www. rfcl. co. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

### 16న బల్దియా బడ్జెట్ మీటింగ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ 2024–25 సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌ను ఆమోదించేందుకు ఈనెల 16న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు నగర మేయర్ బంగి అనిల్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత బడ్జెట్ మీటింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాగా రూ.196 కోట్లతో బడ్జెట్ అంచనాలను రూపొందించారు. గతేడాది బడ్జెట్‌లో రూ.205 కోట్ల మేరకు ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు, ఈ ఏడాది కొంత తగ్గించారు. ఈ ఏడాది బడ్జెట్ అంచనాల్లో రూ.38 కోట్లు జనరల్ ఫండ్ కింద చూపించారు.

### ఇన్‌స్పైర్ అవార్డుకు మోడల్ స్కూల్ విద్యార్థి



సంజనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చెలుకల సంజన ఇన్‌స్పైర్ అవార్డు (2023–24)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించి మాట్లాడారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విడుదల చేసిన జాబితాలో ఫోర్త్ లైట్ బ్లూటు రెడ్యూస్ ట్రాఫిక్ జామ్స్ అంశంపై అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

### ప్యాక్స్ ద్వారా రైతులకు మల్టీపర్పస్ సేవలు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రైతులకు మల్టీపర్పస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పని చేస్తున్నాయని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సంఘాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ రైతులకు మేలైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కోట స్వప్న, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈవో సత్యనారాయణ, ఏజీఎం హన్మంతరావు, కేడీసీసీబీ మేనేజర్ సాగర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### రైతులను నిర్బంధించడం అప్రజాస్వామికం

జ్యోతినగర్(రామగుండం): దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి ఢిల్లీకి బయలుదేరిన రైతులపై మోదీ ప్రభుత్వం నిర్బంధం ప్రకటించడం అప్రజాస్వామికమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, భారత్‌బంద్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నరేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

## జ్ఞాన స్వరూపిణి.. విద్యా ప్రదాయిని









జ్ఞాన స్వరూపిణి.. విద్యా ప్రదాయిని.. సరస్వతీదేవి పుట్టిన వసంత పంచమి రోజున తమ పిల్లలు అక్షరాభ్యాసానికి పురుడు పోసుకుంటే ప్రయోజకులవుతారని తల్లిదండ్రుల విశ్వాసం. ఈ మేరకు సరస్వతీ దేవి ఆలయాల్లో పూజలు చేసి చిన్నారులతో ఓనమాలు దిద్దిస్తారు. బుధవారం వసంత పంచమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రజలు సకల శుభాలు కలిగి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లిలోని హనుమాన్ ఆలయంలో సరస్వతీ దేవి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేసి నైవేద్యం, కానుకలు సమర్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలు పాఠశాలల్లో సైతం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# ర్యాగింగ్ కలకలం

- రామగుండం మెడికల్ కాలేజీలో ఇటీవల ఘటన
- సీసీ కెమెరాలు, కమిటీల పర్యవేక్షణ లేమితోనే..
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం
- ఆదిలోనే అడ్డుకట్ట వేయాలంటున్న పేరెంట్స్

రామగుండం మెడికల్ కాలేజీ




సాక్షి, పెద్దపల్లి: 'నీ పేరేంటీ.. ఎక్కడి నుంచి వచ్చావ్..? ఈ హెయిర్ స్టైల్ నాకు నచ్చలేదు.. ట్రిమ్మింగ్ చేసుకో.. ఈ డ్రెస్సు నాకు నచ్చలేదు వేసుకోకు.. మేం ఆపమనే వరకూ గుంజీలు తీయ్.. ఎవరికైనా ఫిర్యాదు చేశారో అంతే. ముమ్ముందు మాతోనే మీకు పని జాగ్రత్త'.. ఇది వైద్య కళాశాలలో సీనియర్ వైద్య విద్యార్థుల జులుం. కాలేజీకి కొత్తగా వచ్చిన విద్యార్థుల పట్ల కొందరు సీనియర్లు సరదా పరిచయాలు పేరిట వికృత చేష్టలకు పాలపడుతున్న తీరు. దీనికి ర్యాగింగ్ అనే పేరు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేయడం, విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే పంపేయడం, జరిమానా విధించడం, బహిరంగ క్షమాపణ చెప్పడం వంటి కఠిన శిక్షలు వేసినా సమస్య తగ్గడం లేదు. ఏదో రూపంలో జడలు విప్పుతుంది.

**రెండో బ్యాచ్‌తోనే..**

సింగరేణి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఎన్నో ఆశలు, ఆశయాలతో కళాశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులను ర్యాగింగ్ భూతం ఆందోళనకు గురి చేస్తోంది. దీని నిరోధానికి ప్రభుత్వం, పోలీసులు, కళాశాలల యాజమాన్యాలు విద్యా సంవత్సరం ఆరంభంలో సభలు, సమావేశాలు పెట్టి జూనియర్లను సీనియర్లు ఎలా ఆత్మీయంగా అక్కున చేర్చుకోవాలో చెబుతున్నా ఫలితంలో మార్పు కనిపించడం లేదు. అవన్నీ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోతున్నాయి. సిమ్స్ ప్రారంభమై రెండేళ్లు కాగా కాలేజీలో ప్రస్తుతం సెకండ్, ఫస్ట్ ఇయర్ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రూ.కోట్లతో మెడికల్ సీట్లు కొంటున్న ఈకాలంలో ప్రభుత్వం ఉచిత వైద్య విద్యను అందిస్తుంటే.. ఇలాంటి ఘటనల వల్ల ఇక్కడ కొత్తగా చేరేవారు వెనుకంజ వేసే అవకాశం ఉంది.

**యాంటీ ర్యాగింగ్ టీమ్‌లు ఎక్కడ?**

జిల్లాలో మెడికల్ కాలేజీతో పాటు ఇంజినీరింగ్, బీఈడీ, డిగ్రీ, జూనియర్ కాలేజీలున్నాయి. ప్రతీ కాలేజీలో యాంటి ర్యాగింగ్ టీంలు ఏర్పాటు చేసుకోవాలని, టీంలో అధ్యాపకులతోపాటు సరైన నడవడిక కలిగిన సీనియర్ విద్యార్థులు ఉండాలని, దీనివల్ల ఏదైనా కాలేజీలో ర్యాగింగ్ జరిగితే వెంటనే అప్రమత్తమై ముందస్తుగా అరికట్టే అవకాశం ఉంటుందని చెప్పిన యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చాలా కాలేజీల్లో యాంటీ ర్యాగింగ్ టీంలు లేవు. దీంతో పాటు ప్రతీ కాలేజీలో ర్యాగింగ్‌పై జూనియర్లు, సీనియర్లకు కళాశాల ప్రారంభంలోనే సదస్సులు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**సీసీ కెమెరాలు కరువు**

సిమ్స్‌లో విద్యార్థులు ప్రత్యేకంగా కలుసుకోకుండా ఏర్పాట్లు చేయాలి. యూజీసీ నిబంధనల ప్రకారం వారి వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కానీ సిమ్స్‌లో సీసీ కెమెరాలు లేకపోవడమే కొందరు విద్యార్థులు రెచ్చిపోవడానికి ఆస్కారం ఇచ్చినట్లయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### శిక్షలు ఇలా..

- ర్యాగింగ్ నిషేధ చట్టంలోని సెక్షన్–4 కింద ప్రవేశం రద్దు చేసి తొలగిస్తారు. కేసు నమోదు చేసి, నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష.
- తెలంగాణ ర్యాగింగ్ నిషేధచట్టం 1997 ప్రకారం ర్యాగింగ్ చేసినా, ప్రోత్సహించినా సెక్షన్ 4 కింద 6 నెలల కంటే ఎక్కువ జైలు శిక్ష, తర్వాత ఏ సంస్థలో అడ్మిషన్ ఇవ్వరు. మైనర్లను వేధిస్తే పోక్సో చట్టం కింద శిక్ష విధిస్తారు.

### యూజీసీ ఏం చెబుతోంది..?

ర్యాగింగ్‌ను నిషేధిస్తూ సుప్రీంకోర్టు 2009లో ఉత్తర్వులు ఇచ్చింది. యూజీసీ మార్గదర్శకాలు విడుదల చేసింది.

- విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, యాంటీ ర్యాగింగ్ సెల్ ఏర్పాటు చేయాలి.
- ర్యాగింగ్ శృతిమించి విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్, వర్సిటీ రిజిస్ట్రార్లను విచారణకు పిలుస్తారు. వీరు నేషనల్ యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ఎదుట హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.
- విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రముఖ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించాలి.
- యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ ఆదేశాల ప్రకారం జూనియర్లు, సీనియర్ల మధ్య తారతమ్యాన్ని పూడ్చేందుకు మెంటార్‌షిప్‌ను ప్రోత్సహించాలి.
- లీగల్ కౌన్సెలింగ్ ఇచ్చి ర్యాగింగ్ నిరోధక చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించాలి. ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షకు గురువుతారనే బోర్డులను కళాశాల ఆవరణలో ప్రదర్శించాలి.

### నేడు కమిటీ భేటీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మెడికల్ కాలేజీ(సిమ్స్) హాస్టల్‌లో జూనియర్ మెడికోపై, సీనియర్ మెడికోలు ర్యాగింగ్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ర్యాగింగ్ కమిటీ భేటీ కానుంది. భేటీలో కొత్తగా వచ్చిన రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులుతోపాటు సభ్యులు హాజరుకానున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

### నిష్పక్షపాతంగా విచారణ

ర్యాగింగ్ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేసి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం మెడికల్ కాలేజీ యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులు ఇలాంటి విచ్చలవిడి కార్యకలాపాలకు దూరంగా ఉండే వాతావరణాన్ని యాజమాన్యాలు కల్పించాలి. ర్యాగింగ్ పేరిట ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. – మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

### చర్యలు తీసుకుంటాం



కమిషనరేట్ పరిధిలోని కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తాం. సిమ్స్‌లో జరిగిన ఘటనపై ప్రత్యేక దృష్టిసారించి నిందితులపై చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, రామగుండం సీపీ

### కమిటీలో చర్చించి..



ఫస్ట్ ఇయర్ విద్యార్థి నుంచి ఫిర్యాదు అందింది. ర్యాగింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను ఇంటికి పంపించాం. 15న యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశానికి హాజరుకావాలని వారి తల్లిదండ్రులకు చెప్పినం. కమిటీలో నిజనిర్ధారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – హిమబిందు సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్

### బాధ్యతలు స్వీకరించిన డీపీవో



బాధ్యతలు స్వీకరించిన డీపీవో లత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా ఆర్ఏఎస్‌పీ లత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ డీపీవోగా పనిచేసిన చంద్రమౌళి భద్రాద్రి కొత్తగూడెం బదిలీ అయిన విషయం తెలిసిందే.

### రామగుండం బల్దియా కమిషనర్‌గా శ్రీకాంత్



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ కమిషనర్‌గా స్పెషల్ గ్రేడ్ హోదా కలిగిన చింతా శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు శ్రీకాంత్ రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పని చేశారు. కాగా, ఇప్పటి వరకు రామగుండం కమిషనర్‌గా పని చేసిన సీహెచ్.నాగేశ్వర్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం, జీహెచ్ఎంసీలో తక్షణం రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

### సుల్తానాబాద్ కమిషనర్‌గా వేణుమాధవ్



సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా కట్ల వేణుమాధవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ హుస్నాబాద్‌కు బదిలీ అయ్యారు.

### పెద్దపల్లి ఏసీపీగా కృష్ణ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఏసీపీగా గజ్జి కృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వరంగల్ సీసీఆర్‌బీలో ఏసీపీగా పనిచేస్తున్న కృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు. రెండు రోజుల క్రితం పెద్దపల్లి ఏసీపీగా బదిలీ అయిన శ్రీనివాస్ ఉత్తర్వులను రద్దు చేసి కృష్ణను నియమించారు.

### గోదావరిఖని ఏసీపీగా రమేశ్



గోదావరిఖని(రామగుండం): రామగుండం కమిషనరేట్ పరిధి గోదావరిఖని ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న తుల శ్రీనివాస్‌రావు బదిలీ అయ్యారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయింటింగ్‌లో ఉన్న మడత రమేశ్‌ను ఏసీపీగా నియమించారు.

## గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాసులు

- రామగుండం సీపీ శ్రీనివాసులు

గోదావరిఖని(రామగుండం): గంజాయి రవాణా, విక్రయదారులు ఎంతటి వారైనా ఊరుకునేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. కమిషనరేట్‌లోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ర్యాగింగ్ అంశం తన దృష్టికి వచ్చిందని, ఈవిషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జూనియర్లకు సీనియర్ విద్యార్థులు మార్గదర్శకంగా ఉండాలే తప్ప వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. అన్ని కళాశాలల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ర్యాగింగ్‌పై అధికారులు కచ్చితంగా వ్యవహరించాలని అప్పటికప్పుడే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యాంటీ ర్యాగింగ్ కేసులు నమోదు చేయడంతో పాటు ర్యాగింగ్‌కు పాల్పడే వారిని అరెస్ట్ చేస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన సీపీకి అధికారులు ఘన స్వాగతం పలికారు. సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి(మంథని): సింగరేణి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో నిర్వహించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కె.వెంకటేశ్వర్లు, ఎస్.రాధాకృష్ణ పేర్కొన్నారు. కాస్మోటాలజీ (మహిళలు), డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కాస్మోటాలజీ కోర్సుకు ఎలాంటి విద్యార్హత లేదని, ఇతర కోర్సులకు పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాల్‌పల్లి జిల్లాల్లోని సింగరేణి ప్రాంతాల 18 నుంచి 42 ఏళ్ల యువతి, యువకులు ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌సీసీఎల్‌మైన్స్.కామ్/అప్రెంటిషిప్‌లో నమోదు చేసుకోవాలని లేదా మందమర్రి ఎంవీటీసీలో నేరుగా దరఖాస్తులు అందజేయాలకని సూచించారు.

## సమ్మెకు దూరంగా ఉండాలి

- సీఎండీ ఎన్.బలరాం



కాన్ఫరెన్స్‌లో అధికారులు

గోదావరిఖని(రామగుండం): దేశవ్యాప్తంగా ఈనెల 16న తలపెట్టిన ఒక్కరోజు సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అన్నారు. బుధవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక్కరోజు టోకెన్ సమ్మెకు, సింగరేణికి సంబంధం లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉత్పత్తి లక్ష్యాలు సాధించే దిశగా సంస్థ ముందుకు వెళ్తున్న తరుణంలో సమ్మెలతో ఉత్పత్తికి విఘాతం కలుగుతుందన్నారు. సమ్మె డిమాండ్లు సింగరేణి పరిధిలోనివి కావన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సమస్యలకు సింగరేణిలో సమ్మె చేయడం సరికాదని, ఉద్యోగులు విజ్ఞతతో ఆలోచించి విధులకు హాజరుకావాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం అనేక కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఈక్రమంలో లక్ష్యాలు నెరవేరకపోతే రాబోయే రోజుల్లో సంస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఎస్‌ఓటు జీఎం రామ్మోహన్, ఏజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయులు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని మించిన దైవం లేదు



పరామర్శిస్తున్న చంద్రయ్య, పీఎస్ నారాయణ

పెద్దపల్లిరూరల్: తల్లిని మించిన దైవం లేదని, జన్మనిచ్చిన తల్లిదండ్రులు సంతోషపడేలా పిల్లలు నడచుకుంటూ సమాజంలో పదిమందికి సాయపడేలా ముందుకు సాగాలని మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య అన్నారు. ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశం తల్లి లక్ష్మి ఇటీవల మరణించగా బుధవారం పెద్దపల్లిలో రిటైర్డ్ జడ్జి జస్టిస్ పీఎస్ నారాయణతో కలిసి పరామర్శించారు. బార్ అసోసియేషన్ నాయకులు సి.సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, బాదం రమేశ్, తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ధర్మపురి: మండలంలోని మగ్గిడి గురుకులం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. ఈనెల 11న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన సబ్ జూనియర్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాలకు చెందిన అవినాష్, రామ్‌తేజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈనెల 16న నల్గొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సంతోష్ అభినందించారు.

### మన్నెగూడెం హైస్కూల్లో క్షుద్రపూజల కలకలం



మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెం హైస్కూల్లో క్షుద్రపూజల ఆనవాళ్లు కలకలం రేపాయి. ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి గది ముందు విచిత్రమైన బొమ్మల చిత్రాలు, పసుపు, కుంకుమ చల్లి ఉంది. దీంతో స్కూల్‌కు వెళ్లిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎవరో ఆకతాయిలు చేసి ఉంటారని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని తెలిపారు. సంఘటనపై విచారణ చేపడతామన్నారు.

### జాతీయ అథ్లెటిక్స్‌కు జిల్లా క్రీడాకారులు



కరీంనగర్‌స్పోర్ట్స్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 16 నుంచి 18వరకు జరగనున్న జాతీయ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన 13మంది క్రీడాకారులు ఎంపికైనట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ అంతర్ జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, తిరుపతి, ఆంజనేయులు, వరుణ్ అభినందించారు.

### రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–కూనారం మార్గంలోని రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. సదరు వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవన్నారు. ఒంటిపై నీలి రంగు జీన్స్‌ప్యాంటు, తెలుపు రంగు ఫుల్‌షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604కు సమాచారం ఇవ్వాలని కోరారు.



# వరుస ఘటనలు.. భయాందోళన

- వేములవాడలో వణుకుతున్న జనం
- రెండు దొంగతనాలు... ఒక హత్య
- కోనరావుపేటలో వరుస దొంగతనాలు
- ఆందోళనలో జనం
- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు



ఆలయంలో దొంగను పట్టుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది (ఫైల్)

వేములవాడ: హత్యలు.. వరుస దొంగతనాలతో వేములవాడలో జనం బెంబేలెత్తుతున్నారు. రాత్రి వేళ బయట తిరిగేందుకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కోనరావుపేట మండలంలో వరుస దొంగతనాలు.. వేములవాడ పట్టణంలో ఓ హత్యతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జిల్లాలో విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయితో యువత మత్తులో జోగుతూ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

**వరుస సంఘటనలు.. అయోమయం**

- ఈనెల 9న వరంగల్‌కు చెందిన ఓ భక్తుడు రాజన్నను దర్శించుకునేందుకు రావడంతో రూ.5 వేలు దొంగిలించడమే కాకుండా మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును అపహరించేందుకు ప్రయత్నించి ఎస్పీఎఫ్ పోలీసులకు చిక్కాడు.
- ఈనెల 11న గుర్తు తెలియని వ్యక్తి వృద్ధురాలిని బైక్‌పై దింపుతానని చెప్పి ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్లి బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లాడు.
- బైపాస్‌రోడ్డులోని జర్మనీ గెస్ట్‌హౌస్ వద్ద వేములవాడకు చెందిన శ్రీధర్ అనే యువకుడిని స్నేహితుడే హత్య చేయడం కలకలం రేపింది.
- కోనరావుపేట మండలం ధర్మారంలో గుర్రం అంజయ్య ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లడంతో దొంగతనం జరిగింది. మంగళ్లపల్లిలో నంది సిద్ధవ్వ మెడపై కత్తిపెట్టి మూడుతులాల బంగారు పుస్తెలతాడు లాక్కెళ్లారు. శివంగాలపల్లి, మర్తనపేట, నిమ్మపల్లి గ్రామాల్లో వరుస దొంగతనాలతో జనం భయాందోళన చెందుతున్నారు.

**రెండు నెలలుగా భక్తుల రద్దీ**

సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. సమ్మక్క భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఇలా వస్తున్న భక్తుల సంఖ్య భారీగా ఉంటుంది. భక్తుల రద్దీని అదుపు చేస్తున్న పోలీసులు దొంగలపై అప్రమత్తంగా ఉండలేకపోతున్నారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరతతో సతమతమవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

**ఎస్పీఎఫ్ సిబ్బందిపై పోలీసుల గుస్సా**

రాజన్న ఆలయంలో జరుగుతున్న దొంగతనాలు, చిన్నచిన్న ఘటనలను బయటకు తెలిసేలా చేస్తున్నారంటూ స్థానిక పోలీసులు ఎస్పీఎఫ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. భక్తుల డబ్బులు కొట్టేసిన దొంగను పట్టుకుని భక్తులకు డబ్బులు ఇప్పించడంలో తాము చేసిన తప్పేంటో అంటూ ఎస్పీఎఫ్ సిబ్బంది మదనపడుతున్నారు.

**విచ్చలవిడిగా గంజాయి వినియోగం**

వేములవాడలో గంజాయి వినియోగం పెరిగిపోయింది. యువత సాయంత్రం వేళ గంజాయి సేవిస్తూ పెడదోవ పడుతున్నారు. గంజాయి మత్తులో ఏం చేస్తున్నారో తెలియని స్థితి నెలకొంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులు కాస్త దృష్టి సారించి వేములవాడలో గంజాయి విక్రయాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వైద్యుల నిర్లక్ష్యం.. బాలింత మృతి

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



మానస(ఫైల్)



ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

జమ్మికుంట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రసవం కోసం వచ్చిన మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఇద్దరు బిడ్డలను అనాథలుగా మారేలా చేసింది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన జోంగోని మానస(27) రెండోకాన్పు ప్రసవం కోసం జమ్మికుంటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరింది. ఆరోగ్య పరీక్షలు చేసిన వైద్యులు అనంతరం ఆపరేషన్ చేశారు. పండంటి బాబుకు జన్మనిచ్చింది. కొద్దిసేపటికి మానస ఆరోగ్య పరిస్థితి విషమించిందని, హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లాక పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. ప్రయివేటు అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో చనిపోయింది. దీంతో జమ్మికుంటలోని ప్రయివేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మానస చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, వీణవంక ఎస్సై వంశీకృష్ణ, జమ్మికుంట ఎస్సై రాజేశ్ అక్కడికి చేరుకుని మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మానస భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రికి చెందిన ముగ్గురు వైద్యులపై కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# దోస్తును హతమార్చిన వ్యక్తి అరెస్టు

- బైక్ డబ్బులివ్వడంలో నతాయించాడని హత్య



హత్యకు ఉపయోగించిన కత్తి



కురుకుంట్ల బాబును అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

వేములవాడ: స్నేహితుడిని హత్య చేసిన వేములవాడకు చెందిన కురుకుంట్ల బాబును వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఠాణాలో బుధవారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణంలోని ఓల్డ్‌అర్బన్‌కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్, కురుకుంట్ల బాబు స్నేహితులు. మూడేళ్ల క్రితం బాబు బైక్ కొనుక్కున్నాడు. ఇద్దరి మధ్యలో గొడవలు రావడంతో శ్రీధర్ తన స్నేహితుడు బాబు బైక్‌ను పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో వీరి మధ్య వైరం పెరిగింది. అప్పటి నుంచి శ్రీధర్‌పై కక్ష పెంచుకున్న బాబు అవకాశం కోసం ఎదురుచూశాడు. బైక్ తగులబెట్టినందుకు రూ.లక్ష చెల్లించేందుకు ఒప్పుకొని, రూ.50వేలు చెల్లించాడు. మిగతా డబ్బుల కోసం శ్రీధర్ ఇవ్వకపోగా.. తోటి స్నేహితుల ముందు బాబును చులకనభావంతో మాట్లాడేవాడు. ఈక్రమంలోనే బాబు ముంబైకి వెళ్లి పది రోజుల క్రితం వేములవాడకు వచ్చాడు. శ్రీధర్ కించపరిచేలా మాట్లాడుతుండడంతో విసిపోయిన బాబు తన మిత్రుడిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 11వ తేదీ రాత్రి 10.45 గంటల ప్రాంతంలో శ్రీధర్ ఇంటికెళ్లి బయటకు వెళ్దామని బైక్‌పై తీసుకెళ్లాడు. రెండో బైపాస్ పక్కన గల జర్మనీ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాడు. శ్రీధర్‌కు ఫుల్లుగా మద్యం తాగించి, తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హతమార్చాడు. అక్కడి నుంచి శ్రీధర్ బండిపైనే బాబు పరారయ్యాడు. స్థానిక శివపార్వతులకాలనీ పక్కన గల నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద బాబును అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై అంజయ్య, ఏఎస్సై బేగ్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ మండలం గుండారంకు చెందిన బాలకృష్ణ ఉద్యోగ రీత్యా సుల్తానాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం పని నిమిత్తం పెద్దపల్లికి బైక్‌పై వెళ్లి సుల్తానాబాద్‌కు వస్తున్న క్రమంలో చిన్నకల్వల వద్ద వెనక నుంచి లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినీత తెలిపారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మంథని: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలోని కూచిరాజ్‌పల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బూడిద సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కూచిరాజ్‌పల్లికి చెందిన సమ్మయ్య నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. సమ్మయ్యను ఢీకొట్టిన వాహనం ఆచూకీ కోసం తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

### ధర్మపురిలో బాలిక మిస్సింగ్

ధర్మపురి: పట్టణానికి చెందిన ఓ బాలిక ఈనెల 12న అదృశ్యమైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు.మరుసటి రోజు బాలిక తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఇటీవల ధర్మపురిలో ఓ బాలిక లైంగికదాడికి గురైన ఘటన మరువకముందే తాజాగా మరో బాలిక మిస్సింగ్ కావడం చర్చనీయాంశంగా మారింది. బాలిక మిస్సింగ్ అయిందా..? లేక గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారా..? అనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్స్

జగిత్యాల: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి నారాయణ తెలిపారు. జిల్లాలోని 74 కళాశాలల్లో ఈనెల 16న ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.

### జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ వి.సురేశ్‌ను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌కు బదిలీ అయ్యారు. జగిత్యాల డీఎస్పీగా పనిచేసిన వెంకటస్వామిని రెండు రోజుల క్రితం డీజీ కార్యాలయానికి అటాచ్ చేయగా.. బుధవారం రామగుండం సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కొమ్మ యువరాజ్ వాకో ఇండియా ఇంటర్‌నేషనల్ ఓపెన్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. ఈ నెల 7నుంచి 11వరకు ఢిల్లీలో జరిగిన టోర్నీలో అండర్–12విభాగంలో నాన్‌చాక్ కటాలో గోల్డ్ మెడల్ సాధించాడు., హ్యాండ్ కటాలో బ్రాంజ్ మెడల్, 37కిలోల విభాగంలో పాయింట్ ఫైట్‌లో బ్రాంజ్ మెడల్, లైవ్ కాంటాక్ట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో రాణించడంపై యువరాజ్‌ను గ్రామస్తులు అభినందించారు.

### గంజాయి పట్టివేత.. నలుగురి రిమాండ్

మానకొండూర్: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్న మానకొండూర్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారినుంచి 1.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలకేంద్రంలోని చెరువుకట్ట వద్ద మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారినుంచి 1.200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యాట అనిల్‌రెడ్డి(22), లింగాపూర్‌కు చెందిన ఏకుల భరత్(20), మానకొండూర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్(19) ఉన్నారు. ముగ్గురిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్ వివరించారు.

### పార్క్‌లో న్యూసెన్స్.. 13 మందిపై కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ డీర్‌పార్క్‌కు వెళ్లిన యువతీయువకులను బెదిరించిన 13మందిపై ఫారెస్టు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఉన్న డీర్‌పార్క్‌కు 13మంది యువకులు విశ్వహిందూ పరిషత్ కండువాలు ధరించి వెళ్లారు. ప్రేమికుల దినోత్సవం జరుపుకోవద్దంటూ నినాదాలు చేశారు. పార్క్‌లోకి వెళ్లిన యువతీ, యువకులను ఫొటో, వీడియోలు తీస్తూ బెదిరింపులకు గురిచేశారు. ఈ విషయంపై ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ విక్కిమార్టిన్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

### వ్యక్తి అదృశ్యం



యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామానికి చెందిన కొయ్యడ యుగంధర్(43) అదృశ్యమయ్యాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు వివరాల ప్రకారం.. యుగంధర్ ఈనెల 12న ఇంట్లో నిద్రించి 13న కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. అతడి తండ్రి రాజమౌళి బుధవారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. యుగంధర్ ఆచూకీ తెలిసినవారు 87126 56520, 98496 58648 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# సిరిసిల్లలో దొంగతనం

- 110 తులాల వెండి వస్తువులు మాయం
- డీఎస్పీ నివసించే అపార్ట్‌మెంట్‌లో దొంగతనం



ఇంటిలో చిందరవందరగా ఉన్న వస్తువులు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో ఎం.సంపత్ అద్దెకు ఉంటున్న ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్లలోని శ్రీనగర్ కాలనీలో నివసించే సంపత్ కుటుంబీకులతో కలిసి శుభకార్యానికి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకోగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 110 గ్రాముల వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే అపార్ట్‌మెంట్‌లో సిరిసిల్ల డీఎస్పీ నివసిస్తున్నారు. ప్రతిరోజు పోలీస్ వాహనం అక్కడే ఉంటుందని, మంగళవారం రాత్రి పోలీస్ అధికారి అందుబాటులో లేకపోవడంతో వాహనం లేదని.. అదే అదనుగా భావించిన దొంగలు చేతివాటం చూపారని జిల్లా కేంద్రంలో చర్చ జరిగింది.

# రైతు అనుమానాస్పద మృతి



కొమురయ్య మృతదేహం

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన పంబాల కొమురయ్య(54) బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యవసాయ పొలం వద్ద మృతి చెందాడు. పోలీసుల, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం. పంబాల కొమురయ్య బుధవారం తన ద్విచక్రవాహనంపై భార్య విజయను తీసుకెళ్లి ఉపాధికూలీ పనుల వద్ద వదలిపెట్టాడు. అనంతరం తన పొలం వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన విజయ కొమురయ్య ఇంటికిరాకపోవడంతో పొలం వద్దకు వెళ్లింది. పొలంగట్టు వద్ద కొమురయ్య మృతి ఉండడాన్ని గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి ఏఎస్సై లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి పరిశీలించారు. మో చేతులు, నుదిటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. కొమురయ్యకు కొడుకు రాజశేఖర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# అక్రమ మట్టి నిల్వలపై మైనింగ్ అధికారుల కొరడా

- బోయినపల్లిలో 1,500 మెట్రిక్ టన్నుల మట్టి నిల్వ
- చెరువు మట్టి నిల్వలపై రూ.1.80లక్షల జరిమానా
- సిరిసిల్ల జిల్లా మైనింగ్ ఏడీ రఘుబాబు



మట్టి నిల్వల ప్రదేశంలో మైనింగ్ ఏడీ రఘుబాబు

బోయినపల్లి(చొప్పదండి): చెరువు మట్టి అక్రమ నిల్వలపై జిల్లా మైనింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. బోయినపల్లి మార్కెట్‌యార్డు శివారులో అక్రమంగా నిల్వచేసిన 1500 మెట్రిక్ టన్నుల చెరువు మట్టిని గుర్తించి రూ.1.80లక్షలు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ ఏడీ రఘుబాబు బుధవారం తెలిపారు. బోయినపల్లిలో 567 సర్వేనంబర్ స్థలంలో నిల్వచేసిన అక్రమచెరువు మట్టి స్టాక్‌లపై ఫిర్యాదులు రాగా విచారణ చేపట్టి నిల్వ చేసిన వారికి జరిమానా విధించారు. నెల రోజుల్లోపు మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వడం, నిల్వ చేయడం, తరలించడం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.91,991 స్వాహా

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌కు చెందిన వేముల అనిల్‌కుమార్‌ను సైబర్ నేరగాళ్లు పార్ట్‌టైం జాబ్ పేరుతో మోసం చేశారు. అనిల్‌కుమార్‌కు సైబర్‌నేరగాళ్లు ఈనెల 3న టెలిగ్రామ్‌లో పార్ట్‌టైం జాబ్ ఉందని ఓ లింక్ పంపించారు. ఆ లింక్ ద్వారా సంప్రదించగా సైబర్ నేరగాళ్లు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించడంతో వారికి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. అలాగే సైబర్ నేరగాళ్లు ఐదుసార్లు కలిపి మొత్తం రూ.91,991 వారి ఖాతాలోకి బదిలీ చేయించుకుని మోసానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

**రహ్మత్‌పురలో..**

జగిత్యాల పట్టణంలోని రహ్మత్‌పురకు చెందిన ఎండీ.షాబుద్దీన్‌ను సైబర్ నేరగాళ్లు ప్యాకింగ్ పేరుతో మోసం చేశారు. షాబుద్దీన్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం నటరాజ్ పెన్సిల్ ప్యాకింగ్ పేరుతో ఓ యాడ్ రాగా.. ఆ నంబరును సంప్రదించాడు. మొదట కొంత నగదు చెల్లించాలని చెప్పడంతో ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలా మూడు దఫాల్లో రూ.6,950 చెల్లించాడు. తిరిగి ఫోన్ చేస్తే సైబర్ నేరగాళ్లు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

### బజారున పడ్డ బాల్యం



నిరుపేదల కుటుంబాల్లోని బాల్యం బజారున పడింది. బడికెళ్ల చదుకోవాల్సిన పిల్లలు బతుకుపోరులో రోడ్డుపై పడ్డారు. ఆటపాటలకు దూరమై అర్ధాకలికి దగ్గరై తాము నేర్చుకోవాల్సి అక్షరాల చాట్స్ విక్రయిస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులతో కలిసి బొమ్మలు, క్యాలెండర్లు విక్రయిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం ఇలా విక్రయిస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



### ఘనంగా వసంత పంచమి వేడుకలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాల్లో బుధవారం వంసత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక ఇసుక స్తంభం వద్దనున్న భోగ మండపంలో ఆశీనులు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు తదితరులున్నారు. స్థానిక వాణి విద్యాలయంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంగనభట్ల సంతోషి, డైరెక్టర్లు దినేష్, తోట శంకర్ తదితరులున్నారు.

